క్లుప్తంగా

నేడు బొల్లవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

ముప్పాళ్ళ: మండలంలోని బొల్లవరం గ్రామంలో ఈ నెల 25వ తేదీ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారని, మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మాలధారులకు అన్నదానం



రెంటచింతల: వివిధ స్వామి మాలలు ధరించిన మాలధారులకు అన్నదానం చేయడం పుణ్యఫలమని స్థానిక మల్లిఖార్జునస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ అన్నారు. శుక్రవారం స్థానిక అయ్యప్ప సేవా సమితి మండపంలో సుమారు 280 మంది స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వాములకు అన్నదానం చేస్తున్న దాతల కుటుంబ సభ్యులకు హరిహరిపుత్ర అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని గురస్వామి బ్రహ్మారెడ్డి అన్నారు.

సర్వీస్ రోడ్డు పనులు పూర్తి



దాచేపల్లి : సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దాచేపల్లి కొట్ల బజార్‌లోని పాత సర్వీస్ రోడ్డుకు ఇరువైపుల వివిధ వ్యాపారాలు చేసుకునే వారు తోపుడు బండ్లు పెట్టుకుని ఉన్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వ్యాపారస్తులను నాగులేరు ఒడ్డున సర్వీస్ రోడ్డుకు వెళ్లేలా ఒప్పించారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో సర్వీస్ రోడ్డును బాగు చేయించారు. ఇరువైపుల ప్లాట్‌ఫాంతో తారు రోడ్డు నిర్మించారు. సర్వీస్ రోడ్డు పనులు పూర్తికావటంతో చిరు వ్యాపారులను అక్కడికి తరలించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

విశ్వాసంతో జీవించాలి



దాచేపల్లి : విశ్వాసంతో జీవించాలని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ అబ్రహం అన్నారు. మండలంలోని రామాపురం క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో కల్వరి పండుగను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరిని పాపము నుంచి విముక్తి చేసేందుకు ఏసుక్రీస్తు జన్మించారని, క్రీస్తుని సొంత రక్షకుడిగా అంగీకరించాలన్నారు. సాతాను క్రియలు విడిచి పెట్టి పరిశుద్ధంగా జీవించాలని, క్రీస్తు రాకను కనిపెట్టుకుని జీవించాలని ఆయన చెప్పారు. ప్రభువుకి ప్రార్థన చేసి శోధనల నుంచి విముక్తి పొందాలని, శాశ్వతుడైన దేవున్ని పూర్ణ మనస్సుతో ఆరాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఇమ్మానియేల్, బాబన్న, మోషే పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



దాచేపల్లి : బాల్య వివాహాలు అరికట్టాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎల్.శ్రీలక్ష్మీ అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆడపిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపించాలని, 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాల కారణంగా శిశు, మాతృ మరణాలు జరుగుతాయని, తల్లుల్లో రక్తహీనత లోపించటంతో పాటు పిల్లలు బరువు తక్కువగా పుడతారని ఆమె చెప్పారు. చట్టవిరుద్ధంగా బాల్య వివాహాలు చేయవద్దని, ఆడపిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మ పాల్గొన్నారు.

డిసెంబర్ 23న శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 23వ తేదీన గీతామందిరంలో శ్రీమద్భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వాహకురాలు ఈ.అమ్మడు తెలిపారు. ఈమేరకు గీతామందిరం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీల కరపత్రాన్ని విడుదల చేశారు. పోటీలు 4విభాగాలుగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 6, 7వ తరగతి విద్యార్థులకు కర్మయోగం 3వ అధ్యాయం 1 నుంచి 30 శ్లోకాలు, 8, 9 తరగతుల విద్యార్థులకు కర్మయోగం 3వ అధ్యాయం 1నుంచి 40 శ్లోకాలు, 18 సంవత్సరాల వయస్సు లోపు వారికి, పైబడిన వారికి 18 అధ్యాయాలలోని శ్లోకాలు పోటీ ఉంటుందని వివరించారు.

పేదల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

బయ్యవరం, దొడ్లేరు గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు



దొడ్లేరు-2లో సంక్షేమం, అభివృద్ధి వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎండ్రాయిలో సంక్షేమ, అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన దృశ్యం



న్యూచిట్యాలలో కరపత్రాలు పంచుతున్న ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు



న్యూచిట్యాల గ్రామంలో పార్టీ జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ, నాయకులు

క్రోసూరు: పేదల సంక్షేమం కోరుకునేది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు అన్నారు. మండలంలోని బయ్యవరం, దొడ్లేరు-2 సచివాలయాల పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఈ మాదిరిగా సంక్షేమం, అభివృద్ధి కొరకు నిధులు కేటాయించటం జరిగిందా అని అడిగారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సారథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మండలానికి అడిగిందే తడవుగా నిధులు కేటాయించటం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, వెల్‌నెస్ కేంద్రాలు, ఆర్బీకేలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలన గ్రామంలోనే అందించిన ఘనత ఒక్క జగనన్నదేనని అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరు కంకణం కట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం నిధుల వివరాలు తెలుపుతున్న డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగురవేసారు. పల్లెనిద్ర చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ గఫూర్ బయ్యవరంలో ఎంపీటీసీ రామారావు, సర్పంచ్ కాశియ్య, గుర్నాధం, చలమయ్య, కొండలు, కడియం రామారావు, పుల్లారావు పాల్గొన్నారు. దొడ్లేరు-2లో పార్టీ నాయకులు సయ్యద్ అబ్దుల్ రహీం, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సర్పంచ్ ముక్కు అంజలి, గోపి, ఎంపీటీసీలు అల్లా, నాగయ్య, వెంకటేశ్వరరెడ్డి, షేక్ సైదా, కైపు కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎండ్రాయిలో పల్లెకుపోదాం

అమరావతి: ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్న పల్లెకుపోదాం(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం ఎండ్రాయి గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మేకల హనుమంతరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు ప్రారంభించి సచివాలయంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎండ్రాయి గ్రామ సచివాలయం పరిధిలోని ఎండ్రాయి, చావపాడు గ్రామాలలో రూ.18.84 కోట్లు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు చావపాడు సర్పంచ్ చిలకా ఆనందరావు, ఈవో పీఆర్డీ గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిలకా సాంబయ్య, బిక్ష్యాలు, విన్నకోట వాసు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మంచి చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి

బెల్లంకొండ: మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని న్యూచిట్యాల గ్రామంలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయాన్ని సందర్శించి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. దివంగత మహానేత వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా జరుగుతున్న మంచిని ప్రజలకు వివరించేందుకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందాలన్నా, అవినీతి రహిత పాలన సాగించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు అహ్మద్ పాషా, బూదాటి మరియదాసు, గ్రామ సర్పంచ్ భాణావతు నరసింహానాయక్, ఎంపీటీసీ భుక్యా నరసింహానాయక్, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, గ్రామ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు ఐక్యంగా ఉండాలి



పెదకూరపాడు: చేనేత కార్మికులు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరూరి రుషిగప్ప అన్నారు. పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో శుక్రవారం శ్రీలక్ష్మీగణపతి భద్రావతి సమేత భావనరుషీ మందిరంలో చేనేత కార్మికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు సంఘీభావంగా ఉండి, చేనేత కులాలు రాజకీయంగా ఎదిగినప్పుడే అభివృద్ధి చెందుతారన్నారు. రానున్న ఎన్నికల్లో చేతివృత్తుల వారికి సహకరించే పార్టీల తరపున బీసీ కులాల వారందరూ కలసికట్టుగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం రామచంద్రరావు, ఏపీ పద్మశాలి ఉద్యోగ సంఘం వైస్ ప్రెసిడెంట్ హనుమంతరావు, పద్మశాలి సంఘ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర పద్మశాలి యువశక్తి ప్రతినిధులు మునగపాటి రమేష్, గోలి వంశీ, కృష్ణ, సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు, తదితరులు మాట్లాడారు. ఐక్యమత్యంతోనే అభివృద్ధి సాధ్యమని తీర్మానించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గ చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నకరికల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రానున్న సీజన్‌లో చేపట్టాల్సిన పనులపై సమీక్ష జరుగుతుందని అన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

మితిమీరిన యాంటిబయాటిక్స్ అనర్థదాయకం

- పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ రమాదేవి
- క్రోసూరు, ఊటుకూరులో అవగాహన కార్యక్రమాలు



క్రోసూరు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి



ఊటుకూరులో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

క్రోసూరు: వైద్యుల సలహా లేకుండా విపరీతంగా యాంటిబయాటిక్ మందులు వాడడం వలన అనేకమైన అనర్థాలు, అనారోగ్యాలు సంభవిస్తాయని క్రోసూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ రమాదేవి తెలిపారు. యాంటిబయాటిక్ మందుల వాడకంపై ప్రపంచ యాంటిబయాటిక్ వారోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ కాలనుగుణంగా వచ్చే వ్యాధులకు వైద్యులను సంప్రదించాలన్నారు. సొంత వైద్యంతో మందులను వాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలఅంకమ్మబాయి, డాక్టర్ మహ్మద్ సాద్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యాంసన్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఊటుకూరులో..

మండలంలోని ఊటుకూరు గ్రామంలో ప్రపంచ యాంటిబయాటిక్ వారోత్సవాల కార్యక్రమం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ షేక్ మాహబులాబీ మాట్లాడుతూ అధికంగా యాంటిబయాటిక్ మందులు వాడటం మంచిది కాదన్నారు. తరువాత రోజుల్లో ఆ మందులు పనిచేయవని సూచించారు. ఏఎన్ఎం ఏ లక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొని అవగాహన కల్పించారు.

బాలల హక్కుల పట్ల అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పారాలీగల్ వలంటీర్ సుభాని

సత్తెనపల్లి: బాలల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పారాలీగల్ వలంటీర్ షేక్ సుభాని అన్నారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డీ నాగవెంకటలక్ష్మి ఆదేశాల మేరకు పట్టణంలోని 8వ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన బాలల హక్కులపై అవగాహనా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీధి బాలల కొరకు 1098 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, తద్వారా వీధి బాలలకు, తప్పిపోయిన బాలలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ షేక్ ముబారక్, సహాయ కార్మిక శాఖ అధికారిణి వి.అన్నపూర్ణ, ఏహెచ్‌టీయూ పల్నాడు ఎస్ఐ అల్లూరి రెడ్డి, కార్మిక సిబ్బంది చిన్న కోటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, సచివాలయం మహిళా పోలీసులు రాచెల్, నళిని, స్థానికులు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

బొల్లాపల్లి : రోడ్డు ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసినట్లు బండ్లమోటు ఎస్ఐ డి. చెన్నకేశవులు శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్, ఆటో ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయని, అయ్యన్నపాలెం నుంచి కారెంపూడికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మార్గమధ్యంలోని చక్రాయపాలెం గ్రామసమీపంలో పొలాల్లో పైపులు పనిచేస్తున్న ట్రాక్టర్ రోడ్డుపైకి వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో టి.హనుమంతరావు, టి.వెంగమ్మతో పాటు మరో ఇరువురు గాయపడ్డారు. ఈ సంఘటనపై ఆటో డ్రైవర్ టి.హనుమంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కారు స్వాధీనం

ఈపూరు: ఆటోను కారు ఢీకొట్టడంతో కూరగాయల వ్యాపారి మృతి చెందిన సంఘటనలో కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. గురువారం రాత్రి మండల పరిధిలోని వనికుంట సమీపంలో ఆటోలో కూరగాయలు అమ్ముకుంటున్న నాదిసీడి ఏడుకొండలును వినుకొండ నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో ఏడుకొండలుకు తీవ్రగాయాలై మృతి చెందాడు. మృతికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మార్కెట్‌యార్డుల పరిశీలనకు విజ్ఞానయాత్ర

- పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో పలు ముఖ్యమైన అంశాలపై తీర్మానాలు
- హాజరైన గుంటూరు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి
- దూళ్లిపాళ్లలో పత్తి కొనుగోలును పరిశీలించిన జిల్లా మార్కెటింగ్ అధికారి



దూళ్లిపాళ్లలో పత్తి కొనుగోలును పరిశీలిస్తున్న జిల్లా మార్కెటింగ్ అధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి



క్రోసూరు యార్డులో పాలకవర్గ సమావేశంలో చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పాలకవర్గ సభ్యులు

క్రోసూరు: ఇతర రాష్ట్రాలలోని మార్కెట్ యార్డుల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు, అడ్మినిస్ట్రేషన్ పద్ధతులు, ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు చేపట్టిన కార్యక్రమాలు తెలుసుకునేందుకు పాలకవర్గ సభ్యుల విజ్ఞానయాత్రకు తీర్మానం జరిగింది. శుక్రవారం యార్డు పాలకవర్గ సభ్యులతో చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేపట్టటం జరిగింది. యార్డులో పశువుల సంతలో మరొక షెడ్డు నిర్మాణం, కోల్డు స్టోరేజి నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో యార్డు చైర్మన్, వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, పాలకవర్గ సభ్యులు, యార్డు సెక్రటరీ శివశంకరెడ్డి, జిల్లా అధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్తి కొనుగోలును పరిశీలించిన జిల్లా అధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి..

దూళ్లిపాళ్ల జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోలును జిల్లా మార్కెటింగ్ అధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. పత్తి కొనుగోళ్లు రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. దూళ్లిపాళ్లలో పత్తి కొనుగోలు కేంద్రం పెట్టటం వలన రైతులకు కూలీ ఖర్చులు చాలా వరకు తగ్గాయన్నారు. నేరుగా ఇక్కడకే చేరుకోవటంతో పాటు మంచి ధరకే రైతులకు బిల్లులు అవుతున్నాయన్నారు. రైతులకు సీసీఐ సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఆయన వెంట క్రోసూరు యార్డు సెక్రటరీ శివశంకరెడ్డి పాల్గొన్నారు.

బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి



బీఎల్‌వోల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కె.పుల్లారావు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వోలు) ఎన్నికల విధులు అప్రమత్తంగా నిర్వహించాలని తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని బీఎల్‌వోలు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్ల నిండిన వారి ఓటు నమోదు చేయాలన్నారు. మరణించినవారి ఓట్లు తొలగింపు, జీరో డోర్ నెంబర్లు, 10 కన్నా ఎక్కువ ఓట్లు కలిగిన డోర్ నెంబర్లు వంటి అంశాలపై తగు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు తనిఖీ చేసి నివేదిక అందజేయాలన్నారు. బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జే రాజారావు, ఆర్ఐ దాసరి కాంతారావు, ఎన్నికల సూపర్‌వైజర్లు, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలతోనే దేశాభివృద్ధి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి టి. ప్రవల్లిక

నరసరావుపేట టౌన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోనే దేశాభివృద్ధి సాధ్యమని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి. ప్రవల్లిక అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ రామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. బడిఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు. 14 ఏళ్ల లోపు బాల కార్మికులు ఎక్కడైనా పనులు చేస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని కార్మిక శాఖ అధికారి విష్ణు తెలిపారు.. కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ రాజానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు మృతి



సత్తెనపల్లి: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన మంగ్లు (35), ఆయన భార్య, ఇద్దరు పిల్లలు గుంటూరులో అత్త మామల వద్దకు వెళ్లేందుకు పయనమయ్యారు. హైదరాబాదు నుంచి గుంటూరుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెం వద్దకు రాగానే మంగ్లుకు ఛాతిలో నొప్పి ప్రారంభమైంది. సత్తెనపల్లిలో వైద్యశాలకు వెళ్లవచ్చని భావించి నొప్పిని తట్టుకుంటూ సత్తెనపల్లి చేరుకున్నాడు. సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌కు చేరుకునేలోపే ఛాతీనొప్పి అధికమై భరించలేక మంగ్లు తుదిశ్వాస విడిచాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

నాదెండ్లలో ఘనంగా రామాలయ ప్రతిష్ట



నాదెండ్ల: స్థానిక ఉరవకట్ట సెంటర్ బీసీ కాలనీలో వైష్ణవీ హరిదాసుల సంఘం ఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కోదండ రామ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన వేద పండితులు ఉదయం 9.19 గంటలకు సంప్రదాయబద్ధమైన మేళతాళాలతో ప్రతిష్ట నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన తేళ్ల శ్రీనివాసరావు, శ్రీలక్ష్మీ దంపతులు అందించిన ఆర్థిక సాయంతో ఆలయం నిర్మాణ పనులు జరిగాయి. ఈ నెల 22న ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు, 23న హోమాలు, 24న ప్రతిష్ట నిర్వహించారు. రాత్రి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు శాంతి కళ్యాణం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.



రంగనాయకస్వామికి దీపార్చన

సొలస గ్రామంలో శ్రీభూసమేత రంగనాయక స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం దీపార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శంఖు, నామ, చక్ర, స్వస్తిక్ వంటి ఆకారాల్లో ప్రమిదలను అందంగా అలంకరించి వెలిగించారు. దీపకాంతులలో దేవాలయం దేదీప్యమానంగా కనిపించింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. –యడ్లపాడు

మినీలారీ బోల్తా - డ్రైవర్‌కు గాయాలు



చిలకలూరిపేట: పూల లోడుతో వస్తున్న మినీలారీ టైరు పగిలి బోల్తా కొట్టిన సంఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుంచి పూల లోడుతో గుంటూరుకు వెళుతున్న మినీలారీ శుక్రవారం తెల్లవారుజామున పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్‌కు చేరుకునేసరికి టైరు పేలటంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన డ్రైవర్‌కు ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ సిహెచ్ సీతారామయ్య ట్రాఫిక్ పోలీసులను అప్రమత్తం చేసి క్రేన్ ద్వారా బోల్తాపడిన లారీని తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు.